నమస్తే తెలంగాణ
# హైదరాబాద్
హైదరాబాద్- మేడ్చల్
13 | హైదరాబాద్, శుక్రవారం 29 మార్చి 2024 | HYDERABAD



## ఎండ @ 39.2

సిటీబ్యూరో, మార్చి 28 (నమస్తే తెలంగాణ): దక్షిణం దిశ నుంచి తెలంగాణ వైపునకు వీస్తున్న కిందిస్థాయి గాలుల ప్రభావంతో గ్రేటర్‌లో ఉష్ణోగ్రతలు పెరుగుతున్నాయి. గురువారం ఉదయం నుంచి రాత్రి వరకు సిటీలో గరిష్ఠం 39.2, కనిష్ఠం 24.6 డిగ్రీలు, గాలిలో తేమ 20 శాతంగా నమోదైనట్లు హైదరాబాద్ వాతావరణ కేంద్రం అధికారులు వెల్లడించారు.



సఫిల్‌గూడ మినీ ట్యాంక్ బండ్‌పై వాకర్స్‌తో కలిసి ఎన్నికల ప్రచారం చేస్తున్న మల్కాజిగిరి బీఆర్ఎస్ ఎంపీ అభ్యర్థి రాగిడి లక్ష్మారెడ్డి, ఎమ్మెల్యే మర్రి రాజశేఖర్‌రెడ్డి



తారానగర్‌లోని నాలాపై అక్రమ నిర్మాణాలు

# ముంపు తప్పదా?

## యథేచ్ఛగా నాలా ఆక్రమణ

### వరద నీటికి అడ్డుకట్ట వేస్తూ నిర్మాణాలు

### తారానగర్ కాలనీవాసుల్లో భయాందోళన

సిటీబ్యూరో/కొండాపూర్, మార్చి 28 (నమస్తే తెలంగాణ) : వరదను సాఫీగా దిగువకు పోనిస్తే ఎంత పెద్ద వర్షం పడినా.. నష్టం జరగదు. అదే వరదకు అడ్డుకట్ట వేస్తే వీధులు, కాలనీలు, ఇండ్లను ముంచేస్తుంది. సరిగ్గా వరద నీటికి అడ్డుకట్ట వేస్తూ ఓ నిర్మాణదారుడు ఏకంగా ప్రహరీతో పాటు బాత్‌రూంల నిర్మాణాలు చేపట్టాడు. శేరిలింగంపల్లి డివిజన్ పరిధి తారానగర్ తుల్జా భవానీ ఆలయ సమీపంలో వరద నీటి కాలువపై నిర్మిస్తున్నాడు. కండ్ల ముందు అక్రమ నిర్మాణమని తెలిసినా జీహెచ్ఎంసీ అధికారులు అటు వైపుగా కన్నెత్తి చూడటం లేదు. టౌన్ ప్లానింగ్, ఇంజినీరింగ్ విభాగాల సమన్వయ లోపంతో నాలాపై అక్రమ నిర్మాణం జరుగుతున్నది. ఫలితంగా రాబోయే వర్షాకాలంలో వరద నీరు సాఫీగా వెళ్లేందుకు ఎలాంటి మార్గం లేకపోవడంతో తారానగర్ కాలనీవాసులు ఆందోళన చెందుతున్నారు. ఇటీవల రూ.కోట్లు ఖర్చు పెట్టి వరద నీటి కాలువ, నాలాను పునరుద్ధరించిన అధికారులు.. అక్రమ నిర్మాణాలను అడ్డుకోలేక పోవడంపై విమర్శలు వెలువెత్తుతున్నాయి. వీలైనంత త్వరగా నిర్మాణాలను తొలగించకపోతే భవిష్యత్‌లో వరదనీటి సమస్యలు పునరావృతమవుతాయని స్థానికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

### ముంచుతున్న నిర్లక్ష్యం..

జీహెచ్ఎంసీ పరిధిలో వరద నీటి కాలువల పొడవు 1302 కిలోమీటర్ల మేర ఉండగా.. 390 కిలోమీటర్లు మేజర్ నాలా, మైనర్ డ్రైయిన్స్ 912 కిలోమీటర్లు మేర ఉన్నాయి. ప్రతి ఏటా మాదిరిగానే వరద నీరు సాఫీగా దిగువకు వెళ్లేందుకు పునరుద్ధరణ, మరమ్మతు చర్యలు చేపడుతున్నారు. ఇందుకోసం కోట్లాది రూపాయలు ఖర్చు చేస్తున్నారు. అయితే పనులను సకాలంలో చేయకుండా వరద నీటి ముంపునకు అధికారులే పరోక్షంగా కారణమవుతున్నారు. 2022-23 ఆర్థిక సంవత్సరంలో 979 పనులకు రూ.546.72 కోట్లు మంజూరు కాగా, రూ.220.75కోట్లు ఖర్చు చేసి 470 చోట్ల పనులను మాత్రమే పూర్తి చేశారు. ఇదే సమయంలో 2023-24 ఆర్థిక సంవత్సరంలో రూ. 543.26 కోట్లతో 888 ప్రాంతాల్లో పనులు చేపట్టాల్సి ఉన్నా..ఇప్పటి వరకు రూ.162.53 కోట్లు ఖర్చు చేసి 311 చోట్ల మాత్రమే పనులు పూర్తి చేయడం అధికారుల పనితీరుకు అద్దం పడుతున్నది. వచ్చే మూడు నెలల్లోగా పనులు పూర్తి చేయకపోతే వరద ముంపు సమస్యలు తప్పేలా లేవు. ఉన్నతాధికారులు జోక్యం చేసుకొని వరద ముంపు నివారణ చర్యలను వేగవంతంగా చేయాలని స్థానికులు కోరుతున్నారు.



## స్వచ్ఛత గాలికి

చిలుకనగర్ ప్రధాన రహదారిలో వ్యర్థాలు తొలగించకపోవడంతో వాహనదారులు, పాదచారులకు తీవ్ర ఇబ్బందులు ఎదురవుతున్నాయి. చెత్త అంతా.. రోడ్డుపైకి వస్తుండటం.. మరోవైపు వాటి నుంచి వచ్చే దుర్వాసనతో ప్రజలు అవస్థలుపడుతున్నారు. పారిశుధ్య నిర్వహణలో బల్దియాకు 'చెత్త' శుద్ధి లోపించిందంటూ..మండిపడుతున్నారు.

# రేవంత్‌రెడ్డి.. మల్కాజిగిరికి చేసిందేంటి?

### బీఆర్ఎస్ ఎంపీ అభ్యర్థి రాగిడి లక్ష్మారెడ్డి

### సఫిల్‌గూడ మినీ ట్యాంక్ బండ్‌పై ప్రచారం

మల్కాజిగిరి, మార్చి 28: గత మల్కాజిగిరి ఎంపీ, ప్రస్తుత సీఎం రేవంత్‌రెడ్డి ఇక్కడి ప్రజలకు చేసిందేమీలేదని బీఆర్ఎస్ ఎంపీ అభ్యర్థి రాగిడి లక్ష్మారెడ్డి విమర్శించారు. గురువారం మల్కాజిగిరి సర్కిల్ సఫిల్‌గూడ మినీ ట్యాంక్ బండ్‌పై ఎమ్మెల్యే మర్రి రాజశేఖర్‌రెడ్డితో కలిసి ఎన్నికల ప్రచారాన్ని నిర్వహించారు. ఈస్ట్ ఆనంద్‌బాగ్ డివిజన్ శ్రీనగర్‌కాలనీలో పాదయాత్ర చేసి సమస్యలు అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఎంపీ అభ్యర్థి రాగిడి లక్ష్మారెడ్డి మాట్లాడుతూ ఎంపీగా ఉన్న రేవంత్‌రెడ్డి మల్కాజిగిరి వైపు కన్నెత్తి చూసిన దాఖలాలు లేవన్నారు. బీఆర్ఎస్ ప్రభుత్వం మల్కాజిగిరి నియోజకవర్గంలో అభివృద్ధి పనుల కోసం కోట్లాది రూపాయలను మంజూరు చేసిందన్నారు. పార్లమెంట్ ఎన్నికల్లో కారు గుర్తుకు ఓటువేసి గెలిపించాలని ప్రజలను కోరారు. మాజీ కార్పొరేటర్ జగదీశ్‌గౌడ్, బద్దం పరశురాంరెడ్డి, మురుగేశ్, జేఏసీ వెంకన్న, రాము యాదవ్, రావుల అంజయ్య తదితరులు పాల్గొన్నారు.



ఇఫ్తార్ విందులో పాల్గొన్న సికింద్రాబాద్ బీఆర్ఎస్ ఎంపీ అభ్యర్థి పద్మారావుగౌడ్, ఎమ్మెల్యే ముఠా గోపాల్ తదితరులు

## మతసామరస్యానికి ప్రతీక

కవాడిగూడ, మార్చి 28: ముస్లింల పవిత్ర రంజాన్ మాసాన్ని పురస్కరించుకొని గురువారం రాత్రి భోలక్‌పూర్‌లోని ఆషీర్‌ఖానలో మహ్మద్ జాఫర్ ఆధ్వర్యంలో ముస్లిం సోదరులకు ఏర్పాటు చేసిన ఇఫ్తార్ విందుకు సికింద్రాబాద్ బీఆర్ఎస్ ఎంపీ అభ్యర్థి పద్మారావు గౌడ్, ఎమ్మెల్యే ముఠా గోపాల్, బీఆర్ఎస్ గ్రేటర్ సీనియర్ నాయకుడు శ్రీనివాస్ రావు, ఎడ్ల హరిబాబు హాజరయ్యారు. ఈ సందర్భంగా బీఆర్ఎస్ ఎంపీ అభ్యర్థి పద్మారావు మాట్లాడుతూ ఇఫ్తార్ విందు మత సామరస్యానికి ప్రతీక అని, ఐక్యతను పెంపొందిస్తుందని చెప్పారు. ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ నాయకుడు వై. శ్రీనివాస్ రావు, అజయ్ తదితరులు పాల్గొన్నారు.

# అన్నపూర్ణకు తాళం?

### ఇప్పటికే 11 కేంద్రాలను ఎత్తివేసిన బల్దియా

### 150 సెంటర్లకు 139 వాటిల్లోనే రూ.5లకే భోజనం

### పొంతన లేని కారణాలతో సెంటర్లు తగ్గిస్తున్న వైనం



మూసాపేట గూడ్స్‌షెడ్ రోడ్డులో మూసివేసిన అన్నపూర్ణ కేంద్రం

సిటీబ్యూరో, మార్చి 28 (నమస్తే తెలంగాణ): ఆకలితో అలమటించే వాళ్లకు కడుపు నిండా భోజనం పెట్టాలన్న ఉద్దేశంతో శ్రీకారం చుట్టిన 'అన్నపూర్ణ' కేంద్రాల పట్ల జీహెచ్ఎంసీ నిర్లక్ష్యం చూపుతున్నది. పేదల పాలిట 'అక్షయపాత్ర'గా నిలిచిన అన్నపూర్ణ పథకం అధికారుల నిర్లక్ష్యం కారణంగా నీరుగారుతున్నది. కేసీఆర్ ప్రభుత్వ హయాంలోనే దేశంలోనే అతిపెద్ద పథకంగా నిలిచిన ఈ అక్షయపాత్రపై కాంగ్రెస్ ప్రభుత్వం శీతకన్ను వేసింది. ఈ నేపథ్యంలోనే 150 డివిజన్లలో 150 కేంద్రాల ద్వారా ప్రతి రోజుకు 45 వేల మందికి భోజనాలు అందించాల్సిన అధికారులు.. 11 ప్రాంతాల్లో అన్నపూర్ణ సెంటర్లను ఎత్తివేశారు. ప్రస్తుతం 139 కేంద్రాల ద్వారా రూ. 30వేల మందికి మాత్రమే భోజనాలు అందిస్తున్నారు. సరాసరిగా రోజుకు ఒక కేంద్రం ద్వారా 250 భోజనాలు అందిస్తుండగా.. ఏడాదికి రూ.25 కోట్ల మేర బడ్జెట్‌లో నిధులను కేటాయిస్తున్నారు. పేదల కడుపునింపుతున్న అన్నపూర్ణ పథకాన్ని వివిధ కారణాలు చూపుతూ.. ఎత్తివేసే పనిలో జీహెచ్ఎంసీ ఉండటంపై విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. ఇప్పటి వరకు ఖైరతాబాద్, సికింద్రాబాద్, చార్మినార్, శేరిలింగంపల్లి, ఎల్బీనగర్, కూకట్‌పల్లి జోన్ పరిధిలో 11 సెంటర్లను మూసివేయడం గమనార్హం.

### కేసీఆర్ సంకల్పంతో..

హైదరాబాద్ నగరంలో అభాగ్యులు, పేదవారు, వివిధ పనుల కోసం నగరానికి వచ్చే సామాన్యుల ఆకలి తీర్చేందుకు జీహెచ్ఎంసీ అన్నపూర్ణ పథకాన్ని అమలు చేస్తున్నారు. కేసీఆర్ సంకల్పంతో 2014 సంవత్సరం నుంచి అమలవుతున్న ఐదు రూపాయలకే భోజనం విజయవంతంగా కొనసాగుతూ వచ్చింది. గత ప్రభుత్వ హయాంలోనే 10 కోట్ల 88 లక్షల మందికి పైగా భోజనం అందించి దేశంలోనే అతిపెద్ద భోజన పథకంగా నిలిచింది. ఇందుకోసం గత ప్రభుత్వం రూ. 216.01కోట్లు ఖర్చు చేసింది.

హైదరాబాద్ నగరానికి ఆయా పనులు, వివిధ వృత్తులు చేసుకునేందుకు నగరానికి వచ్చిన వారే కాకుండా విద్యార్థులు, నిరుద్యోగులకు అన్నపూర్ణ పథకం వారి దైనందిన జీవితంలో భాగమైంది. రుచి, శుచి సమతుల పోషకాలతో ఆహారాన్ని అందిస్తుండటంతో వలస కార్మికులు, విద్యార్థులు, బ్యాచిలర్స్, చిరుద్యోగులు కడుపు నింపుకోవడంతో ఈ అన్నపూర్ణ భోజనాలకు ఆదరణ లభించింది. 32 అన్నపూర్ణ క్యాంటీన్లలో సిట్టింగ్‌లు ఏర్పాటు చేసి.. ప్రైవేట్ భోజనశాలలకు ఏ మాత్రం తీసిపోకుండా కేంద్రాలను మలిచారు. సకల సదుపాయాలు కల్పిస్తూ ఆకలి తీర్చడమే.. కాకుండా సంతృప్తిగా భోజనం చేశామన్న అనుభూతిని కల్పించేలా చర్యలు చేపట్టారు. జీహెచ్ఎంసీ పరిధిలోని 18 ప్రభుత్వ పెద్ద ఆస్పత్రులకు 17 ప్రభుత్వ వైద్యశాలల్లో రూ. 5లకే అందిస్తున్నారు. అయితే కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక జీహెచ్ఎంసీ ఈ అన్నపూర్ణ సెంటర్ల నిర్వహణను గాలికి వదిలేసింది. ఉన్న సెంటర్లను క్రమక్రమంగా ఎత్తివేయడమే కాకుండా వినియోగంలో ఉన్న 139 కేంద్రాల్లో చాలా వరకు అపరిశుభ్ర వాతావరణంలో ఉంటున్నాయని స్థానికులు వాపోతున్నారు. సెంటర్ల పక్కనే వ్యర్థాలతో పాటు మూత్ర విసర్జనలతో దుర్వాసన వస్తుందని చెబుతున్నారు. గతంలో లాగా నాణ్యమైన భోజనం ఉండటం లేదంటున్నారు.



### కడుపు మాడ్చుకొని.. డ్యూటీ చేస్తున్నా..

ఐదేండ్లుగా గూడ్స్‌షెడ్ రోడ్డులో డ్రైవర్‌గా పనిచేస్తున్నా. ఉదయమే డ్యూటీకి రావడం వల్ల ఇంటి నుంచి భోజనం తీసుకొని రావడానికి వీలు లేక.. అన్నపూర్ణ కేంద్రంలో రూ.5 భోజనం చేసేవాడిని. ఈ మధ్య ఈ కేంద్రం మూసివేయడంతో ఆర్థిక స్తోమత లేక హోటల్‌లో భోజనం చేయలేక.. కడుపు మాడ్చుకొని డ్యూటీ చేయాల్సి వస్తున్నది. అన్నార్తుల కోసం అన్నపూర్ణ పథకం కింద బీఆర్ఎస్ ప్రభుత్వం రూ. 5 భోజనశాలలు ఏర్పాటు చేస్తే.. కాంగ్రెస్ ప్రభుత్వం ఒక్కొక్కటీగా తొలగిస్తూ పేదల జీవితాలతో ఆటలాడుతున్నది. వెంటనే మూసాపేట గూడ్స్‌షెడ్ రోడ్డులోని అన్నపూర్ణ కేంద్రాన్ని పునరుద్ధరించాలని సర్కారును కోరుతున్నా. - సూర్య, డ్రైవర్





# 24X7 వాటర్ ట్యాంకర్

- వచ్చే నెల మొదటి వారం నుంచి అమలు
- కొత్తగా 20 ఫిల్లింగ్ స్టేషన్లు.. అదనంగా 250 ట్యాంకర్లు, డ్రైవర్లు
- రాత్రుల్లో నీటి సరఫరాకు ప్రత్యేక షిఫ్ట్
- ట్యాంకర్ల డిమాండ్ దృష్ట్యా జలమండలి కీలక నిర్ణయం
- వివరాలు వెల్లడించిన పురపాలక శాఖ ముఖ్య కార్యదర్శి దానకిశోర్

సిటీబ్యూరో, మార్చి 28 (నమస్తే తెలంగాణ) : ఒకవైపు తీవ్రమైన ఎండలు..మరోవైపు భూగర్భ జలాలు అడుగంటిపోవడంతో తాగునీటికి యమ డిమాండ్ ఏర్పడింది. ప్రధానంగా వెస్ట్‌జోన్‌లో వాటర్ ట్యాంకర్లకు విపరీతమైన రద్దీ ఏర్పడింది. ఈ నేపథ్యంలోనే జలమండలి కీలక నిర్ణయం తీసుకున్నది. వచ్చే నెల మొదటి వారం నుంచి 24 గంటల పాటు ట్యాంకర్ల ద్వారా నీటి సరఫరా చేస్తామని పురపాలక శాఖ ముఖ్య కార్యదర్శి దానకిశోర్ వెల్లడించారు. ఖైరతాబాద్‌లోని ప్రధాన కార్యాలయంలో వేసవి కార్యాచరణ, ట్యాంకర్ల ద్వారా నీటి సరఫరాపై గురువారం జలమండలి ఎండీ సుదర్శన్‌రెడ్డితో కలిసి దానకిశోర్ ఉన్నతాధికారులతో సమీక్ష నిర్వహించారు. గతేడాదితో పోలిస్తే ఈ సారి ట్యాంకర్ల డిమాండ్ 50 శాతం పెరిగిందని దానకిశోర్ వివరించారు. వినియోగదారుల నుంచి వచ్చే డిమాండ్‌ను తట్టుకునేందుకు పటిష్ట చర్యలు తీసుకుంటున్నట్లు చెప్పారు. రోజుకు 9వేల ట్రిప్పుల నీరు సరఫరా చేసేలా యాక్షన్ ప్లాన్ రూపొందించినట్లు వివరించారు. వాణిజ్య అవసరాలకు నీరు సరఫరా చేసేందుకు ప్రత్యేకంగా నైట్‌షిఫ్ట్ ఏర్పాటు చేశామన్నారు. ప్రతి ఫిల్లింగ్ స్టేషన్ నుంచి వాణిజ్య వినియోగదారుల కోసం 300 అదనపు ట్రిప్పులు సరఫరా చేస్తామన్నారు. ఇందుకోసం 250 కొత్త ట్యాంకర్లు సమకూర్చుకుంటున్నట్లు చెప్పారు. జీహెచ్ఎంసీ, ఇతర మార్గాల ద్వారా 250 మంది డ్రైవర్లను తీసుకుంటామన్నారు.

### బుక్ చేసిన 24 గంటల్లో నీరు సరఫరా చేయాలి

ఏప్రిల్ మొదటి వారం నాటికి అదనంగా ఫిల్లింగ్ స్టేషన్లు ఏర్పాటు చేస్తున్నట్లు దానకిశోర్ తెలిపారు. జీహెచ్ఎంసీ పరిధిలో ఆరు, జీహెచ్ఎంసీ అవతల ఓఆర్ఆర్ పరిధిలో కూడా భవిష్యత్ అవసరాల నిమిత్తం 7 డివిజన్లలో డివిజన్‌కు ఒకటి చొప్పున 14 మొత్తం 20 కొత్త ఫిల్లింగ్ స్టేషన్లు ఏర్పాటు చేస్తున్నారు. ట్యాంకర్ బుక్ చేసిన 24 గంటల్లో నీటి సరఫరా చేయాలని అధికారులను ఆదేశించారు. ఒకవేళ ఆలస్యమైతే ఎస్ఎంఎస్ ద్వారా సమాచారం అందించాలన్నారు. ఈ సమీక్షలో జలమండలి ఈడీ సత్యనారాయణ, డైరెక్టర్లు ప్రవీణ్‌కుమార్, రవికుమార్, స్వామి తదితరులు పాల్గొన్నారు.

# ఉప్పల్‌లో సీఎంఆర్..

ఉప్పల్, మార్చి 28 : ఉప్పల్‌లో సీఎంఆర్ షాపింగ్ మాల్ పునఃప్రారంభమైంది. గురువారం సినీనటి నిధి అగర్వాల్, వజ్రం కన్‌స్ట్రక్షన్ చైర్మన్ కోల ఆంజనేయులు హాజరై ఈ షాపింగ్ మాల్‌ను ప్రారంభించారు. ఈ వేడుకల్లో ప్రత్యేక ఆకర్షణగా నిలిచిన నటి నిధి అగర్వాల్..సందడి చేశారు. పలు రకాల వస్త్రాలను పరిశీలించారు. అభిమానులు నిధి అగర్వాల్‌తో ఫొటోలు, సెల్ఫీలు దిగేందుకు పోటీ పడ్డారు. ఈ సందర్భంగా సీఎంఆర్ ఫౌండర్, చైర్మన్ మావూరి వెంకటరమణ మాట్లాడుతూ షాపింగ్‌మాల్‌లో అన్నిరకాల వస్త్రాలు.. అందరికీ నచ్చే విధంగా అతి తక్కువ ధరలకే లభిస్తున్నాయన్నారు.







# ఎన్నికల కోడ్ ఉల్లంఘన

## జవహర్‌నగర్ మేయర్, డిప్యూటీ మేయర్‌పై కేసు

జవహర్‌నగర్, మార్చి 28: జవహర్‌నగర్ మేయర్ శాంతి, డిప్యూటీ మేయర్ రెడ్డిశెట్టి శ్రీనివాస్‌తో పాటు 5 మంది కార్పొరేటర్లు ఎన్నికల కోడ్‌ను ఉల్లంఘించడంతో జవహర్‌నగర్ పోలీస్‌స్టేషన్‌లో కేసు నమోదైంది. ఈ మేరకు గురువారం మున్సిపల్ కమిషనర్ తాజ్‌మోహన్‌రెడ్డి, ఆర్‌వో ప్రభాకర్ ఎన్నికల కోడ్ ఉల్లంగించిన మేయర్, డిప్యూటీ మేయర్ సహా 5 మంది కార్పొరేటర్లపై పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. ఈ సందర్భంగా ఎస్‌హెచ్‌వో నాగరాజు మాట్లాడుతూ ఈ నెల 27న మున్సిపల్ కార్పొరేషన్ ఏర్పాటు చేసిన చలివేంద్రాలను ప్రారంభించడమే కాకుండా ఆసరా పింఛన్లు పంచారన్నారు. వీటికి సంబంధించిన ఫొటోలు సామాజిక మాధ్యమాల్లో వైరల్ అయినట్లు చెప్పారు. ఎన్నికల కోడ్‌ను ఉల్లంఘించిన మేయర్ శాంతి, డిప్యూటీ మేయర్ రెడ్డిశెట్టి శ్రీనివాస్, కార్పొరేటర్లు శారద, లావణ్య, నాగరాణి, పల్లపు రవి, ప్రేమల శ్రీనివాస్‌లపై కేసు నమోదు చేసినట్లు ఎస్‌హెచ్‌వో నాగరాజు తెలిపారు.